
సాక్షి


శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 19 । జనవరి । 2023



నేడు యోగి వేమన జయంతి

గాండ్లపెంట మండలం కటారుపల్లిలో గురువారం యోగి వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. మంత్రి రోజా పాల్గొననున్నారు. 8లో



టమాట కిలో రూ.25

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.10 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/8.4°

జిల్లా అంతటా బుధవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ బసంత్‌కుమార్



రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి టౌన్: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, భద్రతా కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణా శాఖ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలు, ప్రచార సామగ్రిని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత ఏడాది డిసెంబర్ వరకు జిల్లాలో 44 రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. ఆయా ప్రమాదాల్లో 30 మంది మృతి చెందగా, మరో 71 మంది గాయపడినట్లు వెల్లడించారు. అధికారులంతా మరింత అప్రమత్తతతో వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. జాతీయ రహదారులపై డివైడర్ల ఎత్తు పెంచడానికి గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రమాదాలు జరిగే చోటు స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సరిచేయాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహంగా రూ. 5 వేలు ఇస్తామని, ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లాలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, డీటీసీ కరుణ సాగర్‌రెడ్డి, జాతీయ రహదారుల ఈఈ సంజీవయ్య, ఎంవీఐలు రమణ, వరప్రసాద్, జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు

యూనిఫాం ధరించకపోతే జీతంలో కోత



యూనిఫాం ధరించని గౌకనపల్లి సచివాలయ ఉద్యోగులను మందలిస్తున్న కలెక్టర్

ఎన్‌పీకుంట: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, లేకపోతే జీతాల్లో కోత విధిస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వెలిచలమల, గౌకనపల్లి, మరికొమ్మదిన్నె గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కొందరు ఉద్యోగులు సివిల్ డ్రెస్‌లో కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరికీ జీతాల్లో కోత విధించాలని ఎంపీడీఓను ఆదేశించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సర్వీసులు మరిన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ రవినాయక్, ఈఓఆర్డీ మనోహర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు 72 మంది ఎంపిక

పుట్టపర్తి అర్బన్: అంగన్ వాడీ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఆయా సీడీపీఓ కార్యాలయాల్లో ఉంచినట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీ కుమారి తెలిపారు. మొత్తం 110 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 16 అంగన్‌వాడీ, 15 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 41 మంది సహాయకులు కలిపి 72 మందిని జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 30వ తేదీలోపు నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు. ఇంకా 14 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 23 సహాయకుల ఉద్యోగాలు భర్తీ కాలేదని, వాటికి తిరిగి నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు.

పట్టు అధరహో



రైతులు తెచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు



హిందూపురం మార్కెట్‌లో వేలం కోసం పట్టుగూళ్లను ర్యాక్‌లలో ఉంచిన దృశ్యం

మిలమిల మెరిసే పట్టు... మల్బరీ రైతుల ఇళ్లల్లోనూ ఆనందాల కాంతులను నింపుతోంది. కుటుంబమంతా కలిసి చెమటోడ్చినా రెండేళ్ల క్రితం వరకూ లాభాల 'పట్టు'దొరికేది కాదు. కానీ కరోనా తర్వాత అంతర్జాతీయంగా మన పట్టుకు డిమాండ్ పెరిగింది. దీంతో హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు అంచనాలు మించి పలుకుతున్నాయి. దీంతో అటు రైతులు, ఇటు రీలర్లు సంబరపడుతున్నారు.

- మార్కెట్‌లో పట్టుగూళ్లకు భారీ డిమాండ్
- రూ.700పైనే పలుకుతున్న కిలో బైవోల్టిన్
- హిందూపురం మార్కెట్‌కు రోజూ 7 వేల క్వింటాళ్ల గూళ్లు
- చలితో దిగుబడి తగ్గినా.. నష్టం లేదంటున్న రైతులు

హిందూపురం: మల్బరీ సాగుకు శ్రీసత్యసాయి జిల్లా పెట్టింది పేరు. ఇక హిందూపురం మార్కెట్ పట్టుగూళ్లకు అంతర్జాతీయంగా పేరుంది. మిగతా మార్కెట్లతో పోలిస్తే ధర కూడా ఎక్కువగా పలుకుతుంది. అందువల్లే హిందూపురం, మడకశిర, గుడిబండ, సోమందేపల్లి, పెనుకొండ, లేపాక్షితోపాటు చిత్తూరు, కుప్పం, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రైతులు ఇక్కడికే సరుకు తీసుకువస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకూ గూళ్లకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండేది. ధరలు కూడా అలాగే ఉండేవి. అయితే కరోనా తర్వాత కూడా చైనా సిల్క్ మార్కెట్ కోలుకోకపోవడంతో మన పట్టుగూళ్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో రెండేళ్లుగా రైతులు లాభాలు చూస్తున్నారు.

కొత్త ఏడాదిలో కిలో రూ.700పైమాటే

ఈ ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకూ హిందూపురం మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ గూళ్లు రూ.700పైనే పలుకుతున్నాయి. రాష్ట్రంలోని ధర్మవరం, చిత్తూరు, మదనపల్లె, పలమనేరు ప్రాంతాల్లోని పట్టుగూళ్ల మార్కెట్లలోనూ మంచి ధరలు లభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే హిందూపురం మార్కెట్ అందరికీ అనుకూలంగా ఉంటుందని, అందువల్లే ఎక్కువ మంది రైతులు పట్టుగూళ్లను ఇక్కడికే తీసుకువస్తుంటారని చెబుతున్నారు. వాస్తవానికి కర్ణాటకలోని శిడ్లగట్ట మార్కెట్‌లో పట్టుగూళ్లకు మంచి ధర లభిస్తుందని రైతులు చెబుతుంటారు. కానీ ప్రస్తుతం అక్కడితో పోలిస్తే హిందూపురం మార్కెట్‌లోనే ఎక్కువ ధర పలుకుతుండటంతో ఇక్కడికి సరుకు తీసుకువస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. బుధవారం ఇక్కడ కిలో బైవోల్టిన్ ధర ఏకంగా రూ.766 మేర పలకడం విశేషం.

దిగుబడిపై చలి ప్రభావం

పట్టుగూళ్లకు మంచి ధర లభిస్తున్నా...చలి ప్రభావంతో ఈసారి దిగుబడి తగ్గింది. అయినప్పటికీ ధర ఎక్కువగా ఉండటంతో లాభాలు చూస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రానున్న రోజుల్లోనూ పట్టుగూళ్లకు మంచి ధర దక్కే అవకాశాలు ఉండటంతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు.

జనవరి నెలలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా...

తేదీ	కనిష్టం (రూ.)	గరిష్టం (రూ.)	సగటు (రూ.)
10-01-23	491	739	682
11-01-23	574	750	678
12-10-23	309	737	666
13-01-23	482	770	699
14-01-23	476	740	666
16-01-23	625	741	706
17-01-23	500	752	697
18-12-21	351	766	689

ధర బాగుంది



పట్టుగూళ్లకు మంచి ధర దక్కుతోంది. గతంలో పట్టుగూళ్లు ఎంత నాణ్యంగా ఉనాస్ కిలో రూ.400 మించి పలికేవి కావు. ఇప్పుడు కిలో రూ.700పైనే పలుకుతున్నాయి. రెండేళ్లుగా మంచి ధర దక్కుతుండటంతో రైతులు లాభాలు చూస్తున్నారు. కాకపోతే చలి ప్రభావం వల్ల దిగుబడి, నాణ్యత తగ్గింది. అయినప్పటికీ మార్కెట్‌లో పట్టుగూళ్లకు ధర బాగుండటంతో నష్టం రావడం లేదు.

– వెంకటేష్, కుప్పం, చిత్తూరు.

మంచి డిమాండ్ ఉంది



ప్రస్తుతం నాణ్యమైన బైవోల్టిన్ పట్టుగూళ్లకు మంచి డిమాండ్ ఉంది. పట్టుగూళ్లకు ఇంతటి ధర ఇప్పుడే చూస్తున్నాం. గతంతో పోలిస్తే ధర రెండింతలు పెరిగింది. అయితే చలి ప్రభావం దిగుబడిపై భారీగా చూపింది. మల్బరీ కుమిలిపోవడం, ఆకులు తినకుండా పురుగులు చాలా చనిపోతున్నాయి. సున్నపు కట్టు వ్యాధి సోకుతోంది. చలి నుంచి కాపాడుకుని జాగ్రత్తగా గూళ్లు తీస్తే ఇప్పుడున్న ధరలతో రైతు ఇంట సిరులే.

–సిద్దేశ్వర్, మడకశిర

గూళ్లు గట్టిపడితే ధర పెరుగుతుంది



మల్బరీ రైతులు చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. గాలి, వెలుతురు వచ్చేలా చూసుకుని పురుగులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టాలి. అంతేగాక గూళ్లకు మంచి ధరలు దక్కాలంటే నాణ్యత పెరగాలి. గూళ్లను కనీసం 8, 9 రోజుల తర్వాత మార్కెట్‌కు తీసుకుని వస్తే అవి గట్టిపడి మంచి ధర దక్కుతుంది. చాలామంది బరువు తగ్గిపోతుందని భావించి 5, 6 రోజులకే తీసుకువస్తారు. దీనివల్ల తేమశాతం ఉండి నాణ్యత తగ్గుతుంది.

–లక్ష్మీరెడ్డి, పట్టుగూళ్ల మార్కెట్ అధికారి, హిందూపురం

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



పోలీస్ పరేడ్ గ్రౌండును పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో తొలిసారిగా ఈనెల 26వ తేదీన గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు, అధికారుల సంఖ్యను అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా పోలీస్ మొబిలైజేషన్ కార్యక్రమం

ఏఆర్ సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పలు సూచనలు చేశారు. ఈనెల 17 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ మొబిలైజేషన్ ఉంటుందన్నారు. ఏఆర్ సిబ్బందికి ఉద్యోగాల్లో చేరే ముందు ఇచ్చిన శిక్షణను గుర్తుచేస్తూ మరోసారి ఫైరింగ్, డ్రిల్లు, మార్చ్‌ఫాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ బందోబస్తుపై శిక్షణ ఇస్తామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకుని విధుల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, అడ్మిన్ ఆర్ఐ టైటాస్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి 'డైట్' సెమిస్టర్ పరీక్షలు

కొత్తచెరువు: 'డైట్' ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షలకు అనంతపురం జిల్లా నుంచి 16 మంది, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 121 మంది హాజరు కానుండగా, అందరికీ బుక్కపట్నం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం కేటాయించామన్నారు. ఉదయం 9 గంటలకే పరీక్ష ప్రారంభమవుతుందని, అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

దుర్గమ్మ జాతరపై పచ్చ విషం

- ఏళ్లుగా ఎస్సీల ఆధ్వర్యంలోనే ఆలయ నిర్వహణ, జాతర
- తాజాగా ఎస్సీలు ఆలయంలోకి రావొద్దంటూ టీడీపీ నేతల హుకుం
- అధికారులకు ఫిర్యాదు చేసిన సంజీవపురం ఎస్సీ కాలనీ వాసులు



సంజీవపురం ఎస్సీ కాలనీలోని దుర్గమ్మ ఆలయం

ధర్మవరం: తమ రాజకీయ స్వార్థం కోసం టీడీపీ నాయకులు ఎంతకైనా దిగజారుతున్నారు. వర్గాలు, కులాలుగా ప్రజలను విభజించి లాభం పొందాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే బత్తలపల్లి మండలం సంజీవపురం ఎస్సీ కాలనీలో నిర్వహించే దుర్గమ్మ జాతరను అడ్డుకునేందుకు పావులు కదిపారు. చివరకు ఎస్సీ వర్గానికి చెందిన వారు కట్టుకున్న ఆలయంలోకి వారినే రాకుండా అడ్డుకుంటున్నారు.

ఏళ్లుగా ఎస్సీల ఆధ్వర్యంలోనే పూజలు

బత్తలపల్లి మండలం సంజీవపురంలో పురాతన దుర్గమ్మ ఆలయం ఉంది. గ్రామానికి చెందిన చిన్న కుళ్లాయప్ప ఆలయ బాధ్యతలు నిర్వహించేలా 1992లోనే గ్రామస్తుల సమక్షంలో అగ్రిమెంట్ చేసుకున్నారు. అప్పటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలను చిన్నకుళ్లాయప్ప వర్గం వారే చూస్తున్నారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గత ఏడాది డిసెంబర్‌లో ఎస్సీ కాలనీ వాసులంతా కలసి చందాలు వేసుకుని మరికొందరు దాతల సహకారంతో దుర్గమ్మ, మారెమ్మ, నల్లలమ్మ ఆలయాలను నిర్మించారు. ఆలయ నిర్మాణంలోనూ చిన్నకుళ్లాయప్ప కీలక పాత్ర పోషించారు. అలాగే ఎస్సీ కాలనీకే చెందిన నాగభూషణ, నర్సింహులు, ఈశ్వరయ్యలు తలోవంతు చేయి వేసి ఆలయ పునః ప్రతిష్ట చేశారు. ఈనెల 20వ తేదీన పెద్ద ఎత్తున జాతర నిర్వహించాలని ఏర్పాట్లు పూర్తి చేశారు.

టీడీపీ నాయకుల కుట్ర

దాతలు ఇచ్చిన విరాళాల్లో ఆలయ నిర్మాణం ఖర్చులు పోనూ రూ.4 లక్షల నగదును టీడీపీ సానుభూతిపరులైన పెద్దల వద్ద భద్రపరిచారు. జాతరకు ఆ డబ్బులివ్వాల్సి వస్తుందని భావించిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడైన చిన్నకుళ్లాయప్ప వర్గంపై కక్ష గట్టారు. వారు ఆలయంలోకి రాకూడదని, జాతరలో పాల్గొన కూడదని హుకుం జారీ చేశారు. వారికి వంత పాడుతూ నాగభూషణ, నర్సింహులు, ఈశ్వరయ్య కూడా పేచీ పెట్టారు. ఆలయ నిర్వహణలోగానీ, జాతరలో గానీ చిన్న కుళ్లాయప్ప వర్గం వారు రాకూడదని దౌర్జన్యానికి దిగారు. బాధితులు తహసీల్దార్ యుగేశ్వరి దేవికి, బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దౌర్జన్యం చేస్తున్నారు



20ఏళ్లకుపైగా మా ఆధ్వర్యంలోనే ఏటా దుర్గమ్మ జాతర జరిగేది. ఆలయ నిర్వహణలోనూ మేమే కీలక పాత్ర పోషిస్తూ వచ్చాం. ఇప్పుడు మేము వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులమన్న కారణంతో ఆలయంలోకి రావొద్దంటున్నారు. జాతరలో పాల్గొన వద్దని దౌర్జన్యం చేస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే టీడీపీ ప్రభుత్వం వచ్చాక జాతర చేద్దామంటున్నారు.

–చిన్న కుళ్లాయప్ప, ఆలయ, జాతర నిర్వాహకుడు, సంజీవపురం

చర్యలు తీసుకుంటాం



దుర్గమ్మ జాతర నిర్వహణ బాధ్యతలు చేపట్టనీయడం లేదని ఎస్సీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రవేశానికి నిరాకరించే హక్కు ఏ ఒక్కరికీ లేదు. ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

–యుగేశ్వరి, తహసీల్దార్, బత్తలపల్లి

నిర్విఘ్నంగా మహా క్రతువు

ఎవరైనా సరే తాము కష్టపడి సంపాదించిన ఆస్తిని తమ పిల్లలకు ఇవ్వాలనుకుంటారు. తీరా ఆ సమయమొచ్చే సరికి ఆ భూమిని ఎవరో గద్దల్లా తన్నుకుపోతే.. ఆ బాధ ఎలా ఉంటుందో ఊహించుకోవడానికి కూడా ఎంతో కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను పూర్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. ఎప్పుడో వంద సంవత్సరాల కిందటి రికార్డులకు సంబంధించి కూడా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, లంచాలకు ఆస్కారమివ్వకుండా అత్యాధునిక యంత్రాలతో పకడ్బందీగా సమగ్ర రీసర్వే చేపడుతోంది.

- ఉమ్మడి జిల్లాలో జోరుగా భూముల రీసర్వే
- వివాదాలు, కోర్టు కేసులు వంటి ఎన్నో అవాంతరాలు
- చిక్కుముడులు విప్పుకుంటూ ముందుకెళుతున్న అధికారులు
- డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు

ఇప్పటివరకూ జిల్లాలో రీసర్వే సాగిందిలా..

మొత్తం గ్రామాలు	461
ఫీల్డ్ సర్వే మొదలైన గ్రామాలు	329
మొత్తం సర్వే నంబర్లు	9,16,776
మొత్తం రికార్డులు	15,51,471
ఇప్పటివరకూ సర్వే నంబర్ల పరిశీలన	45,047
పూర్తయిన రికార్డుల పరిశీలన	75,301
వివాదాస్పద రికార్డులు	02
మృతి కారణంగా ఆగిన మ్యుటేషన్లు	372
సర్వే నంబర్ల తొలగింపు	247
నిషేధిత భూముల రికార్డులు	1,033
కోర్టు కేసులు	340

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల సమగ్ర రీ సర్వే నిర్విఘ్నంగా సాగుతోంది. ప్రతి మండల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులు కచ్చితత్వంతో కొలతలు తీస్తూ ముందుకు సాగుతున్నారు. దశాబ్దాల తరబడి వివాదాలు, కోర్టు కేసులు, గొడవలతో తమ భూములను తాము అమ్ముకోలేక పోయిన ఎంతో మంది హక్కుదారులకు సర్వే ఊరటనిస్తోంది.

అడ్డంకులను అధిగమిస్తూ

భూసర్వేలో రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు హక్కుదారులు చనిపోవడంతో భూమార్పిడికి సమస్య ఏర్పడింది. కొన్ని కోర్టు కేసులు, ఇంకొన్ని సర్వే నంబర్లలో ఉన్నదాని కంటే ఎక్కువ భూమి ఉండటం, సర్వే నంబర్ల సవరణలు ఇలా.. సమస్యలు పరిష్కరిస్తూ రికార్డులు సవరిస్తున్నారు. ప్రతి గ్రామ పరిధిలోనూ భూములు, హక్కుదారుల సరిహద్దులు, గ్రామకంఠాలు, పోరంబోకు, చుక్కల భూములు, నిషేధిత భూములు, ప్రభుత్వ భూములు ఇలా ప్రతి రికార్డునూ పరిశీలించి రికార్డుల్లోకి ఎక్కిస్తున్నారు.

'తోపుదుర్తి' జనసంద్రం

- ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విందుకు అశేష జనం
- ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేసిన ఎమ్మెల్యే
- తరలివచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు
- ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు



తోపుదుర్తి గ్రామ ప్రధాన రహదారిలో భారీ జనసందోహం



తోపుదుర్తికి తరలివచ్చిన వారితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి 8లో

క్లుప్తంగా

రగ్గుల దుకాణంలో అగ్ని ప్రమాదం


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేష్

ధర్మవరం: ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసుకున్న రగ్గుల దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం ధర్మవరంలోని సాయినగర్‌లో ఫుట్‌పాత్‌పై రగ్గుల దుకాణంఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గుర్తించిన దుకాణదారులు అతి కష్టంపై మంటలను అదుపు చేశారు. అప్పటికే రూ.2 లక్షల విలువైన రగ్గులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మేడాపురం వెంకటేష్... మధ్యప్రదేశ్‌కు చెందిన బాధితులు తుపాన్‌సింగ్, బంజారా కుటుంబసభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.


యువకుడి అనుమానాస్పద మృతి

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లిలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సింగానహళ్లికి చెందిన బోయ శంకరప్ప కుమారుడు పవన్‌కళ్యాణ్ (22) అవివాహితుడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోర్సు చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఇంటికి చేరుకున్న పవన్‌కళ్యాణ్ మంగళవారం శ్రీధరఘట్టలో జరిగిన ఊరి దేవరకు కుటుంబ సభ్యులతో కలసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తండ్రి శంకరప్ప, కుటుంబసభ్యులు మంగళవారం రాత్రే ఇంటికి తిరిగి వెళ్లారు. అర్ధరాత్రి వరకూ శ్రీధరఘట్టలోనే బంధువులతో గడిపిన పవన్‌కళ్యాణ్ తర్వాత స్నేహితులతో కలసి బయటకు వెళ్లాడు. బుధవారం వేకువజాము 2 గంటలకు స్వగ్రామానికి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు. ఆ సమయంలో భారీగా గురక పెట్టడంతో తండ్రి శంకరప్ప నిద్ర మేల్కొన్నాడు. ఊపిరి అందక కుమారుడు పడుతున్న ఇబ్బందిని గమనించి, వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. శంకరప్ప ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మధ్యయుగ వైతాళికుడు వేమన

వానకు తడవనివారు, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. సుమారు 1652 – 1730 మధ్య కాలములో జీవించిన వేమన.. ప్రజాకవిగా.. సంస్కరణాభిలాషిగా.. కులాన్ని నిరసించిన మానవతావాదిగా.. పరభాషా ఆధిపత్యాన్ని ప్రశ్నించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారు. మూఢాచారాలపై చైతన్య బావుటా ఎగురేసి తర్వాతి తరానికి పూర్వ రంగం సిద్ధం చేశాడన్న సత్యాన్ని ఎంతో మంది సిద్ధాంతీకరించారు. ఆటవెలదులనే తూటాలుగా మార్చి, తన కవితా స్ఫూర్తితో తెలుగు సాహితీలోకాన్ని సుసంపన్నం చేసిన యోగి వేమనకు అత్యంత గౌరవమిస్తూ ఆయన జయంతిని తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వేమన జయంతిని సంబరంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కటారుపల్లెలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. – అనంతపురం కల్చరల్:

- తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన ప్రజాకవి జయంత్యుత్సవాలు నేడు అధికారికంగా



కటారుపల్లిలో పూజలందుకుంటున్న వేమన సమాధి

'భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబుతానవును
విశ్వధాబి రామ వినుర వేమ'

...ఇలా అందరికీ అర్థమయ్యే చిన్న పదాలతో సంఘ సంస్కరణ, శ్రమ గొప్పతనం, నైతిక విలువల నిర్మాణం వంటి జీవిత సత్యాలను తెలిపిన మధ్యయుగ వైతాళికుడు వేమనను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ఎన్నో ఉత్సవాలు జిల్లా వేదికగా సాగాయి. అయితే అధికారికంగా తొలిసారి వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుండడంపై సాహితీవేత్తలు, విద్యావేత్తలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

'అనంత'తో మమేకం

ఉమ్మడి 'అనంత' జిల్లాతో వేమన జీవితం ముడిపడిపోయింది. గండికోటను పాలించే గడ్డంరెడ్డి మూడవ సంతానంగా 1652లో వేమారెడ్డి జన్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. అయితే ఆయన జన్మస్థలంపై కచ్చితమైన సమాచారం లేకున్నా.. 1730లో కదిరి ప్రాంతంలో సమాధి అయిన మాట వాస్తవమని అందరూ అంగీకరిస్తున్నారు. ఇప్పటికీ ఆయన సమాధి ఉన్న శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లె పర్యాటక క్షేత్రంగా భాసిల్లుతోంది. కులం కన్నా గుణం ప్రధానమని మంచి చెడుల విశ్లేషణకు మధ్యయుగంలోనే బీజాలు వేసిన వేమన సాహిత్యంతో ఇక్కడి వారెందరో ప్రభావితమయ్యారు.

నేడు పద్య పఠన పోటీలు

నైతిక విలువలను, సమాజం పట్ల వ్యవహరించాల్సిన తీరును చాటి చెప్పే వేమన పద్య పఠన పోటీలను వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణంలో వేమనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన జయంతిని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 100 పాఠశాలల్లో పద్య పఠన పోటీలు ఏర్పాటు చేశారు.

వేమన పాఠ్యాంశాలు ఉండాలి



సమాజంలో సమస్యలను వేమన ఎత్తిచూపిన విధానం, పరిష్కార మార్గం వినూత్నంగా, విలక్షణంగా ఉన్నా.. నేటికీ అవి కొనసాతుండడం బాధాకరం. కాబట్టే వేమన సాహిత్యం మరింత విస్తృతం కావాలి. ప్రతి తరగతి గదిలో వేమన పాఠ్యాంశాలుంటే జాతి చైతన్యవంతమవుతుంది. వేమన సాహిత్యమంటే విజ్ఞానభాండాగారమే.

–డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సాహితీ విమర్శకులు

సీమ సాహిత్యం విశ్వవ్యాప్తమైంది



వేమనతోనే సీమ సాహిత్యం విశ్వ వ్యాప్తమైంది. వేమన వంటి మహనీయుని జయంతిని అధికారికంగా జరపడం ఎంతో ఆనందించదగ్గ విషయం . ఆయన పద్యాలే కాదు నిరాడంబరమైన జీవితం అందరికీ ఆదర్శప్రాయం. వేమనా ఫౌండేషన్ అధ్యక్షునిగా వేమన సాహిత్యాన్ని ప్రచారం చేసే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

– ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, మాజీ వైస్ చాన్సలర్

తోపుదుర్తి జనసంద్రం



తోపుదుర్తి కుటుంబ సభ్యులతో మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, విందుకు హాజరైన జనం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామం బుధవారం జనసంద్రమైంది. 140 ఏళ్ల తర్వాత నిర్వహించిన పెద్దమ్మ తల్లి ఊరి దేవరకు భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందులో 50 వేల మందికి పైగా పాల్గొనడం విశేషం. ముందుగా తోపుదుర్తి కుటుంబ సభ్యులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పొలిమేరకు చేర్చి పూజలు చేశారు. తర్వాత విందును ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, సోదరులు చందు, రాజశేఖర్‌రెడ్డి అక్కడే ఉంచి పర్యవేక్షించారు. 36 కౌంటర్ల ద్వారా మాంసాహార, శాకాహార వంటకాలను వడ్డించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విందు కొనసాగింది. కొందరు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు వాటర్ బాటిళ్లు అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ ఇంటి పండుగలా భావించి అతిథులకు భోజనం వడ్డించారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు, పోలీసు శాఖ వారు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రామానికి దగ్గరలోనే దాదాపు ఐదెకరాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు 108 వాహనాలతో గ్రామంలోనే ఉండి సేవలందించారు.

తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నేతలు

ఊరి దేవరలో భాగంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన విందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తరలివచ్చారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహులు, మేయర్ వసీం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విందుకు హాజరైన ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, అనంత, శంకరనారాయణ, సిద్దారెడ్డి ,ఎమ్మెల్సీ ఇక్బాల్ తదితరులు

కటారుపల్లిలో నేడు వేమన జయంతి

- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ బసంత్‌కుమార్, అధికారులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, తదితరులు

గాండ్లపెంట: విశ్వకవి యోగి వేమన జయంతి వేడుకలను గాండ్లపెంట మండలం కటారుపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం అధికారికంగా నిర్వహించనుంది. వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా, హిందూపురం ఎంపీ గోరంట్లమాధవ్, కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ వరప్రసాదరెడ్డి, పలువురు అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో వేడుకల ఏర్పాట్లను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. వేమన సమాధి వద్ద చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభాస్థలిని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే బాలబాలికలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, కర్నూలు డీవీఎం ఈశ్వరయ్య, జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, ఎంపీడీఓ అంజినప్ప, తహసీల్దార్ రవి, పలుశాఖల అధికారులు ఉన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

వేమన జయంతిని పురస్కరించుకుని కటారుపల్లిలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి రోజా పర్యటన ఇలా..

మంత్రి రోజా పర్యటన వివరాలను కలెక్టర్ బసంత్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఉదయం మదనపల్లి నుంచి రోడ్డు మార్గంలో 7.30 గంటలకు కదిరికి చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు కటారుపల్లిలో జరిగే వేమన జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. భోజన విరామం అనంతరం కటారుపల్లి నుంచి బయలుదేరి నగరికి వెళ్లనున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

తాడిమర్రి: మండలంలోని ఆత్మకూరులో పోట్లమర్రి గ్రామానికి చెందిన ఏకో నారాయణ భార్య ఈశ్వరమ్మ(56) బుధవారం పాము కాటుతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... బుధవారం మధ్యాహ్నం తన సొంత పొలంలో ఈశ్వరమ్మ గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. విషయాన్ని వెంటనే కుటుంబసభ్యులకు తెలపడంతో ఆమెను పోట్లమర్రిలోని నాటు వైద్యుని వద్ద చికిత్స చేయించారు. పరిస్థితి విషమిస్తుండడంతో అనంతరం ఆమెను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అక్కడే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈశ్వరమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

గోరంట్ల: ప్రేమించిన యువతి దూరం కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన పి.ప్రభాకర్ (24) ఓ అమ్మాయిని ప్రేమించాడు. అయితే ఆమె నిరాకరించడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ప్రభాకర్ బుధవారం నిర్మాణంలో ఉన్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

20న బాలికల హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం: ఈ నెల 20న ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలికల హాకీ జట్ల ఎంపికలను నిర్వహించనున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్ జూనియర్ విభాగానికి 2006, జనవరి 1 తర్వాత జన్మించిన వారు, జూనియర్ విభాగానికి 2003, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. ఆసక్తిగల క్రీడాకారిణులు వెంట ఆధార్‌కార్డు, పదో తరగతి మార్కులు జాబితాను తీసుకురావాలి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28న అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారు.

బాలికపై అత్యాచారయత్నం


నిందితుడు చక్కిరరెడ్డి

రొద్దం: మండల పరిధిలోని కలిపి పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఆరేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నలభై ఏళ్ల వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన చక్కిరరెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఒంటరిగా ఉన్న బాలికను అంగడి వద్దకు పిలుచుకెళ్లి చాక్‌లెట్లు కొనిచ్చాడు. అనంతరం పాతలప్ప గుడి వద్ద చాటుకు తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో నొప్పి తాళలేక బాలిక గట్టిగా కేకలు పెట్టడంతో ఆ ప్రాంతానికి సమీపంలో నివాసముంటున్న మహిళ అక్కడకెళ్లి చక్కిరరెడ్డిని పట్టుకుని చితకబాది, విషయాన్ని గ్రామస్తులకు తెలిపింది. వ్యవసాయ పనులు ముగించుకుని రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు విషయాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై బుధవారం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

జెడ్పీ ఏఓగా అమృతరాజ్



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఓ)గా ఉరవకొండ ఎంపీడీఓగా పని చేస్తున్న ఎండీ అమృతరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఉరవకొండ ఎంపీడీఓగా రిలీవ్ అయి కొత్త పోస్టులో చేరారు. కాగా, నాలుగు నెలల క్రితం ఏఓగా నియమితులైన గుత్తి ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు అనేక వివాదాలకు కేంద్ర బిందువు కావడంతో ఆయనను యథాస్థానానికి పంపడం గమనార్హం. ఈ మేరకు ఉత్తర్వులు అందగానే ఆయన రిలీవ్ అయ్యారు.

ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా శోభాబిందు

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్– 2023 రాష్ట్ర కన్వీనర్‌గా జేఎన్‌టీయూ (ఏ) ప్రొఫెసర్ సి.శోభాబిందు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ ఈఏపీసెట్‌ను రెండో దఫా జేఎన్‌టీయూ (ఏ) నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ (ఏ) పాలకభవనంలో సెట్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ, ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర చైర్మన్ జింకా రంగజనార్ధన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఈసెట్ కన్వీనర్ శోభాబిందును వీసీతో పాటు రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తదితరులు అభినందించారు.

వీసీకి అభినందనలు

జేఎన్‌టీయూ(ఏ) వీసీ జింకా రంగజనార్ధన బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఈ రెండేళ్లలో వర్సిటీ అభివృద్ధికి ఆయన అమలు చేసిన సంస్కరణలను రిజిస్ట్రార్ సి.శశిధర్ కొనియాడారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌కు ప్రతి అధ్యాపకుడు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఓఎస్డీ టు వీసీ దేవన్న, ప్రిన్సిపాల్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్ల క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ల అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ బుధవారం ఆవిష్కరించారు. జెడ్పీ ఆవరణలోని చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ భాగ్యరాజ్, పీఆర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కరరెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు డీఎల్ మురళీ, జనరల్ సెక్రటరీ ప్రసాద్, ఉపాధ్యక్షురాలు జింకా కృష్ణజ్యోతి, ట్రెజరర్ పాండురంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మధుప్రకాష్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మధుసూదన్, ట్రెజరర్ రాజేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతయ్య శెట్టి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఈఈలు) కేవీ ప్రసాద్, శ్రీనివాసులు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల వేటగాళ్ల అరెస్టు

- పట్టుబడిన తొమ్మిది మంది
- వెలుగు చూసిన ఏఆర్ మాజీ కానిస్టేబుల్ హత్యకు కుట్ర
- తదుపరి విచారణ నిమిత్తం అనంతపురం పోలీసులకు కేసు బదిలీ


వివరాలు వెల్లడిస్తున్న పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం వంకరకుంటలో సంచలనం రేకెత్తించిన గుప్త నిధుల తవ్వకాల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడిన తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

నల్లమాడ పోలీసు సర్కిల్ పరిధిలోని వంకరకుంట గ్రామానికి చెందిన రైతు వెంకటాద్రి పొలంలో గుప్త నిధుల కోసం ఈ నెల 14న కొందరు తవ్వకాలు జరిపారు. ఈ ఘటనపై రైతు వెంకటాద్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో నల్లమాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి లోతైన దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది.

పట్టుబడింది వీరే..

గుప్త నిధుల తవ్వకాల కేసులో పట్టుబడిన వారిలో ఖమ్మం నివాసి నిజాముద్దీన్, నల్లమాడ మండలం చెరువు వాండ్లపల్లికి చెందిన శివశంకరరెడ్డి, నరేంద్రరెడ్డి, హైదరాబాద్ నివాసి శ్రీనివాసులు, పుట్టపర్తికి చెందిన విజయ్, తమిళనాడుకు చెందిన చాంద్‌బాషా, మురుగన్, సురేష్, అనంతపురానికి చెందిన ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ భార్య నాగమణి ఉన్నారు. వీరి నుంచి గుప్త నిధుల తవ్వకానికి వినియోగించిన ఇనుపరాడ్లు, బండను తొలగించేందుకు ఉపయోగించే 20/30 పౌడర్, పూజకు వినియోగించిన ముడుపు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇదే కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు.

హత్య కుట్ర వెలుగులోకి

పట్టుబడిన నిందితులను విచారణ చేయడంతో అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్యకు పన్నిన కుట్ర వెలుగు చూసింది. ప్రకాష్, నాగమణి దంపతులు. ప్రకాష్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకుని భార్యను నిర్లక్ష్యం చేయడమే కాక, వేధింపులకు గురి చేస్తుండడంతో ఖమ్మంకు చెందిన నిజాముద్దీన్‌తో కలసి భర్త హత్యకు నాగమణి పథకం రచించింది. దీంతో తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును అనంతపురం పోలీసులకు బదిలీ చేశారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన నల్లమాడ సీఐ నిరంజన్‌రెడ్డి, నల్లమాడ, ఓడీసీ, బుక్కపట్నం, అమడగూరు ఎస్ఐలు వలీబాషా, గోపీకుమార్, నరసింహుడు, వెంకటరమణ, సర్కిల్ సిబ్బందిని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ అభినందించారు.